క్లుప్తంగా

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఆత్మకూర్: మండలంలోని జూరాల ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలను బోధించారు. డీఓ ఈగా, ఎంఈఓగా, హెచ్ఎంలతో పాటు 20మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా బాధ్యతలను నిర్వర్తించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొండాపురం శ్రీనివాసులు, నారాయణ, శ్రీనివాస్, వర్షిణి, స్వాతి, సీఆర్పీ సౌమ్య, విద్యార్థులు ఉన్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయాలి



వనపర్తి టౌన్: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 19న హిందూవాహిని ఆధ్వర్యంలో నిర్వహించే శోభాయాత్రను పట్టణ ప్రజలు విజయవంతం చేయాలని హిందూవాహిని జిల్లా కన్వీనర్ అరుణ్‌గౌడ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ సోమవారం జిల్లా కేంద్రంలోని రామాలయం నుంచి మధ్యాహ్నం 3 గంటలకు రామాలయం నుంచి పాతబజార్‌లోని కాళీ మాత గుడి వరకు అంగరంగ వైభవంగా శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. యువత యాత్రలో ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హిందూవాహిని పట్టణ అధ్యక్షుడు నంద, నాయకులు రోహిత్, మూర్తి, కార్తీక్, అర్జున్, కురుమూర్తి, సిద్ధు, ధీరజ్ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ శిబిరం



పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రత్యేక అవసరాల పిల్లల కోసం శుక్రవారం ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉండే ప్రత్యేక అవసరాల పిల్లల కోసం విద్యాశాఖ తరఫున ప్రతి వారం క్యాంపును నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. ఫిజియోథెరపీ డాక్టర్ బాలకృష్ణ పిల్లలకు పరీక్షలు నిర్వహించి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ప్రతి వారం నిర్వహించే ఈ క్యాంపును ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు సంతోష్, కేశవులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి



ఖిల్లాఘనపురం: వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ శ్రీహరి తెలిపారు. శుక్రవారం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద ఆటో డ్రైవర్లకు వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో మద్యం తాగరాదని, హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని సూచించారు. మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వాల్‌పోస్టర్ విడుదల

కొత్తకోట రూరల్: బీసీలు అన్ని విధాల వెనుకబాటుతనానికి అగ్రవర్ణాల వారే కారణమని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయ్య యాదవ్ ఆరోపించారు. అడిగితే వచ్చేది శూన్యం.. పోరాడితేనే వచ్చేది రాజ్యాధికారం వాల్‌పోస్టర్‌ను స్థానిక నివేదిత డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణయ్యయాదవ్ మాట్లాడుతూ 75ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో కనీస మౌళిక వసతులు కూడా నేటికీ అందని వేలాది బీసీ కులాలు ఎన్నో ఉన్నాయన్నారు. జనాభా దమాషా ప్రకారం బీసీలు పాలనలో వాటా పొందినప్పుడే వెనుకబడిన కులాల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో బీసీ సేన నాయకులు గొడుగు నర్సింహులు, కుమార్‌యాదవ్, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





కొత్తకోటలో..



కేతేపల్లిలో



జిల్లా కేంద్రంలో..

కేంద్రం విధానాలపై ఉద్యమం తప్పదు

సాక్షి, నెట్‌వర్క్: కేంద్ర ప్రభుత్వం కార్మికుల శ్రమను దోపిడి చేసేందుకు తీసుకొచ్చి నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు బాల్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఎండీ జబ్బార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ అన్నారు. కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు దేశంలోని అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన సమ్మెకు సీఐటీయూ, కాంగ్రెస్, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, సీపీఐ, సీపీఎం, సీపీఐ ప్రజాపంథా, బీఆర్ఎస్, రైతు సంఘాల నాయకులు, అన్ని రంగాల కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల కార్మికుల శ్రమను దోపిడి చేయడమే కాకుండా రైతులు కష్టపడి పండించి పంటలకు మద్దతు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. కార్మికులకు రూ.26వేలు ఖచ్చిత వేతనం, ప్రాథమిక హక్కుగా ఉపాధి హామీని అమలు చేయాలని, పాత పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయేజ్, హన్మంతు, జీఎస్ గోపి, రాజు, శ్రీహరి, ప్రసాద్, రాజు, మోష, రాబర్ట్, భారతీయుడు, సీఎనొట్టి, అయూబ్‌ఖాన్, నాగభూషణం గౌడ్, నరసింహులు గౌడ్, చీర్ల ప్రసాద్, అంగన్‌వాడీ జిల్లా ఉపాధ్యక్షురాలు శారద, అనసూయ, రాజు, భగత్, వేణు, ఎంపీటీసీ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో ఆందోళన చేస్తున్న కార్మిక సంఘాలు, వివిధ పార్టీల నాయకులు



మదనాపురంలో..



ఖిల్లాఘనపురంలో..



మదనాపురంలో..



పాన్‌గల్‌లో..



వీపనగండ్లలో..



ఆత్మకూర్‌లో..

మిల్లులను శివారు ప్రాంతాలకు తరలించాలి

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలోని నివాస గృహాల మధ్య ఉన్న రైస్‌మిల్లు, వేరుశెనగ మిల్లులను శివారు ప్రాంతాలకు తరలించి ప్రజల ప్రాణాలను కాపాడాలని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఇళ్ల మధ్య రైస్ మిల్లులు ఉండడంతో దుమ్ము, ధూళితో నిత్యం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్నేళ్ల క్రితం ఇప్పుడున్న రైస్ మిల్లులు పట్టణ చివరలో ఉన్నాయని, కానీ పట్టణ జనాభా విస్తరించడంతో మిల్లుల చుట్టూ నివాస గృహాలు ఏర్పాటు చేసుకున్నారని వివరించారు. వాటి నుంచి వచ్చే దుమ్మతో ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్య దృష్ట్యా వాటిని ఊరు చివరకు మార్చాలని ఆయన అధికారులను కోరారు. పట్టణ ప్రజల విజ్ఞప్తి మేరకు ప్రజల సమస్యలపై అఖిల పక్ష ఐక్యవేదిక ద్వారా అండగా ఉంటూ పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

హరిత మొక్కలను కాపాడుకుందాం

అమరచింత: ప్రధాన రహదారుల వెంట నాటిన హరిత మొక్కలను సంరక్షించుకోవాలని ఎంపీఓ నరసింహులు కోరారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో శుక్రవారం చెట్టుచెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా మొక్కలకు నీటిని అందించారు. ఈసందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని, పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ హరిత మొక్కల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసిందని, ఉపాధి హామీ కూలీలతో ప్రతినిత్యం మొక్కలను నీటిని అందించడానికి వాచర్లను నియమించిదని తెలిపారు. వేసవి ఎండలు ముదురుతున్నందున క్రమం తప్పకుండా రోజుకు రెండు సార్లు మొక్కలకు నీటిని అందించాలని ఆదేశించారు.మురుగుకాల్వల పరిశుభ్రతకు కార్యచరణ రూపొందించాలని కార్యదర్శులకు సూచించారున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

అధికారులు అంకితభావంతో పనిచేయాలి



కొత్తకోటలో..



వీపనగండ్లలో ఎస్ఐని సన్మానిస్తున్న మల్లయ్య

కొత్తకోట రూరల్: కొత్తకోట ఎంపీడీఓగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన చెన్నమ్మను జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. అభివృద్ధిలో తామంతా అండగా ఉంటామని ఎంపీడీఓకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాల్‌రెడ్డి, ఏపీఎం రాజశేఖర్‌రెడ్డి, ఏపీఓ రాములు, ఎంపీఓ రవీందర్‌బాబు, గోపాల్‌నాయక్, సంజీవుడు, కృష్ణయ్యగౌడ్, లక్ష్మణ్ నాయక్, ఆశన్న, రంజిత్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, నాగరాజు, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వీపనగండ్ల: మండలంలో వివిధ హోదాల్లో ఇటీవలే పదవీ బాధ్యతలు స్వీకరించిన అధికారులకు శుక్రవారం పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు శాలువాలతో సన్మానించారు. ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్న నందీకర్‌ను మాజీ రైతుబంధు సమితి అధ్యక్షుడు ముంత మల్లయ్య యాదవ్, సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, కేవీపీఎస్ నాయకులు మురళీ శాలువాలతో సన్మానించారు. అదే విధంగా ఎంపీడీఓ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారిగా బాధ్యతలు తీసుకున్న శ్రీనివాసరావును సహ ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, టైపిస్ట్ అమీర్, పంచాయతీ కార్యదర్శులు నరేష్‌గౌడ్, శ్రీకాంత్, రాము, ఉపాధి ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠశాల ఆట స్థలం పరిశీలన

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించిన ఆట స్థలాన్ని శుక్రవారం మండల తహసీల్దార్ శ్రీనివాసులు పరిశీలించారు. పాఠశాల ఆట స్థలం కబ్జాకు గురైందని పాఠశాల పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు కలెక్టర్ కార్యాలయానికి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ నివేదిక కోరగా శుక్రవారం సందర్శించామని తహసీల్దార్ తెలిపారు. గతంలోనే ఏర్పాటు చేసిన పాఠశాల ఆట స్థలం బోర్డుల వరకు స్థలం ఉందని గుర్తించామన్నారు. ఒకరు ఇళ్లు నిర్మించుకోగా.. మరికొందరు గడ్డివాములు ఏర్పాటు చేసుకున్నట్లు పరిశీలించామని తెలిపారు. శనివారం కలెక్టర్‌కు రిపోర్టు పంపిస్తామని పేర్కొన్నారు.

ముగిసిన అబ్దుల్ రహీం ఉర్సు

మదనాపురం: కుల మతాలకతీతంగా జరిగే అబ్దుల్ రహీం ఆరాధన ఉర్సు మండలంలోని దుప్పల్లిలో శుక్రవారం ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన ఉర్సుకు చుట్టు పక్కల గ్రామాలతో పాటు కర్ణాటక, ఒడిశా, మహరాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి దర్గాను దర్శించుకున్నారు. భక్తులు తమ మొక్కులను కానుకల రూపంలో దర్గా షరీఫ్‌కు సమర్పించారు. ఉర్సును పురస్కరించుకొని మిఠాయి దుకాణాలు, హోటళ్లు, పిల్లల ఆటల వస్తువుల షాపులు వెలిశాయి. ఉదయం దివ్యఖురాన్ పఠనం కార్యక్రమంతో పాటు రాత్రి జరిగిన తోశ ఫతే కార్యక్రమంతో ఉత్సవాలు ముగిశాయి.

పీఠాధిపతుల ప్రార్థనలు

తాండూర్ సయ్యద్ అబ్దుల్ కరీం దర్గా పీఠాధిపతులు సయ్యద్ సాబేర్ పాష, అజీష్ పాష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వచ్చిన భక్తులకు మూడు రోజుల పాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విడిది సత్రాలు, అన్నదానం, తాగునీటి వసతి ఏర్పాట్లు చేశారు. నిర్వాహకులు సుకుమార్‌గౌడ్, శిష్యబృందం, సభ్యులు పాల్గొన్నారు.

'వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి'

కొత్తకోట రూరల్: దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి వాస్తవాలు తెలుసుకోకుండా అసెంబ్లీలో మాట్లాడుతున్నారని, బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి నియోజకవర్గ ప్రజలకు తెలుసని జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధి కోసం గత పాలకులు పట్టించుకోలేదని, విద్య, వైద్యంపై నిర్లక్ష్యం చేశారని ఎమ్మెల్యే శుక్రవారం అసెంబ్లీలో మాట్లాడటాన్ని బీఆర్ఎస్ శ్రేణులు ఖండించారు. మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హయాంలోనే దేవరకద్రలో 100పడకల ఆస్పత్రి కోసం కమిషనర్ ఆఫ్ తెలంగాణ ప్రభుత్వం నుంచి 2023, జులై 27 రోజున రూ.35కోట్లు, కొత్తకోటలో 30పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం సెప్టెంబర్ 23న రూ.5.75కోట్ల నిధులు మంజూరు చేయించి అన్ని అనుమతులతో అక్టోబర్ 4న నాటి మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా శంకుస్థాపన చేయించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు పి.విశ్వేశ్వర్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ సాకబాలనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ గుంత మల్లేష్, సంజీవుడు, వినోద్‌సాగర్, నాగరాజు ఉన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్

రక్తదాన శిబిరం

కొత్తకోట రూరల్: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిని డాక్టర్ విద్య అన్నారు. కొండా లక్ష్మణ్ ఉద్యానవన కళాశాల విద్యార్థులు పెద్దమందడి మండలంలోని వెల్టూర్‌లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఐదు రోజులుగా చేపడుతున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కళాశాల విద్యార్థులతో పాటు ప్రొఫెసర్లు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారిని డాక్టర్ విద్య మాట్లాడుతూ వివిధ ప్రమాదాల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి మనం ఇచ్చే రక్తం వారి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. రక్తదానం చేయడం వల్ల హృదయం, ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా క్యాన్సర్‌ను దూరం చేస్తుందన్నారు. శారీరక బరువును నియంత్రించడంలో కూడా సహాయపడుతుందన్నారు. ప్రొఫెసర్ బేబీరాణి, డాక్టర్ షహనాజ్, డాక్టర్ పూర్ణిమ మిశ్రాతో పాటు కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిప్రసాద్ పాల్గొన్నారు.



వెల్టూర్‌లో రక్తదానం చేసిన ఉద్యాన కళాశాల విద్యార్థులు, ప్రొఫెసర్లు

భద్రతపై విద్యార్థులకు అవగాహన

పెబ్బేరు రూరల్: ఆడపిల్లల భద్రత, భరోసాపై షీటీం, సఖి, భరోసా, చైల్డ్‌లైన్ టీమ్స్ వనపర్తి శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం పెబ్బేరు పాలిటెక్నిక్ కళాశాలలో విదార్థునులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న వివిధ రకాల లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థల గురించి, డయల్ 100, బాల కార్మిక వ్యవస్థ 1098 పై విద్యార్థునులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏకే శ్రీకాంత్ మాట్లాడుతూ ఇలాంటి సామాజిక కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు దశరథంనాయక్, గంధం రంగస్వామి, తిరుపతి, ఆర్డీఎస్ సభ్యులు హరికృష్ణ, షీ టీం హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, సఖి, భరోసా కోఆర్డినేటర్ శిరీష, కీర్తి, చైల్డ్‌లైన్ టీమ్ సభ్యులు అశోక్, విద్యార్థునులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

గ్రామాల్లో ప్రారంభమైన సీసీ రోడ్ల పనులు

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు ప్రారంభమయ్యాయి. మండలానికి జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.2.68 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో గ్రామాల్లోని మట్టి రోడ్లలో సీసీ లు వేస్తున్నారు. మండలంలోని ఆముదంబండ తండా, దొంతికుంట తండా, కమాలోద్దీన్‌పూర్, సల్కెలాపురం, అప్పారెడ్డిపల్లి గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు చేస్తున్నారు. డీఈ ప్రమోద్, ఏఈ కబీర్‌దాస్ తరుచుగా గ్రామాల్లో పర్యటిస్తూ పనులను పర్యవేక్షిస్తున్నారు. పనుల్లో నాణ్యత పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు.

యథేచ్ఛగా తవ్వుతున్న డబుల్ బీటీ రోడ్డు

వీపనగండ్ల: మండల కేంద్రం నుంచి గోవర్ధనగిరి వరకు దాదాపు రూ.8 కోట్లు ఖర్చు చేసి నిర్మించిన డబుల్ బీటీ రోడ్డును కొద్దిపాటి అవసరాలకే రైతులు తవ్వుతున్నా సంబంధించిన అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. నూతన రోడ్డును నిర్మించి 5 నెలలే గడుస్తున్నా పలువురు ఈ రోడ్డుపై తవ్వకాలు జరపడం కేజీ వీల్స్ ద్వారా ట్రాక్టర్లను నిర్లక్ష్యంగా నడపడతంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనల మేరకు రోడ్డును తవ్విన వారిపై చర్యలు తీసుకుని రైతుల అవసరాలకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపాలని ట్రాక్టర్ డ్రైవర్లకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

నామినేటెడ్ పదవుల్లో బీసీలకు అవకాశం కల్పించాలి

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఉన్న నామినేటెడ్ పదవులు బీసీ, కులవృత్తుల వారికి కేటాయించాలని బీజేపీ ఓబీసీ జిల్లా కార్యదర్శి బెన్నూరు ఆశన్న శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా బీసీ, కులవృత్తుల కుటుంబాలకు న్యాయం జరగడం లేదని వాపోయారు. రాష్ట్రంలో జనాభా పరంగా పెద్ద సంఖ్యలో ఉన్న బీసీలు, కుల వృత్తుల వారు అభ్యున్నతి సాధించాలంటే రాజకీయంగా ఉన్న నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలన్నారు. అందుకు బీసీలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

పేదల పక్షానే సీపీఐ పోరాటం

పాన్‌గల్: పేదలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఐ పోరాటాలు కొనసాగిస్తుందని పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కాకంబాల స్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ అధికారంలో ఉన్నా.. లేకున్నా ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తూ పేదల పక్షాన నిలబడుతుందన్నారు. సీపీఐ పోరాటాల వలనే ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు, సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తుందన్నారు. పార్టీ సభ్యత్వాలు పొంది పేదల హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సహదేవ్, రాముడు, పరందాములు, కాకం రాముడు, శంకరయ్య, బాలస్వామి, నర్సింహ, అశోక్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి



ఆత్మకూర్: తపాలాశాఖ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు నూతన భవనాన్ని నిర్మించామని ఉమ్మడి మహబూబ్‌నగర్ తపాలా సూపరింటెండెంట్ మహ్మద్ అలీమ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని గాంధీచౌక్‌లో నిర్మించిన తపాలా కార్యాలయం కొత్త భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాత భవనం శిథిలం కావడంతో కొత్త భవనం నిర్మించామని వివరించారు. కార్యక్రమంలో స్థానిక పోస్టుమాస్టర్ ప్రతాప్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య నమస్కారాలు పాటిస్తే ఆరోగ్యం



వనపర్తిలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు



మనిగిళ్ల జెడ్పీహెచ్ఎస్‌లో..

కొత్తకోట రూరల్: ప్రతి రోజు సూర్య నమస్కారాలు చేస్తే శక్తి వస్తుందని యోగ కోచ్ సుగుణ అన్నారు. రథసప్తమి సందర్భంగా పెద్దమందడి మండలంలోని మనిగిళ్ల జెడ్పీహెచ్‌లో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆమె రథసప్తమి గురించి వివరిస్తూ ఉత్తరాయణ పుణ్య కాలంలో సూర్యుడి గమనం దక్షిణ దిశ నుంచి ఉత్తర దిశకు మారే పర్వదినమే రథసప్తమి అన్నారు. యోగాసనాలు వేయడం వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం శంకర్‌గౌడ్, ఉపాధ్యాయులు నాగేశ్వరమ్మ, సురేంద్రనాథ్, చంద్రకళ, రాము, కస్తూరి ఉన్నారు.

విద్యార్థులకు యోగా క్లాసులు

పెబ్బేరు రూరల్: రథసప్తమి సందర్భంగా యోగా కోచ్ సుగుణ ఆధ్వర్యంలో శుక్రవారం వనపర్తి పట్టణంలోని గిరిజన సంక్షేమ పాఠశాలలో యోగా ఉపాధ్యాయురాలు విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రథసప్తమి రోజు సూర్య భగవానుడు ఆశీస్సులు అందరికీ ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలి అనుసరించాలని సూచిస్తూ విద్యార్థులతో 108 సార్లు సూర్యనమస్కాలు చేయించినట్లు ఆమె తెలిపారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో తాము ఉపాధి కోల్పోయామని ఆటో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. పెద్దమందడి మండలంలోని బలిజపల్లి, జంగమాయపల్లిలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసన రాస్తారోకో చేశారు. అనంతరం జంగమాయపల్లి నుంచి వనపర్తి వరకు ఆటో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆటో నడిపితేనే తమ కుటుంబ పోషణ సాధ్యమవుతుందని, కానీ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, శివాజీరావు, వెంకటేష్, మల్లయ్య, బాబు, పాండునాయక్, రమేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



జంగమాయపల్లిలో రాస్తారోకో చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు